


"ఇరానీ హోటల్లో టీ తాగుతూ ఫ్రాయిడ్‌నీ, భగవంతుణ్ణీ, తలచుకుంటుండగా నువ్వు గుర్తు కొచ్చావు. ఎదురుగా కుర్చీల్లో యూనివర్శిటీ కుర్రాళ్ళు తీవ్రవాదాన్ని అధ్యయనం చేస్తున్నారు. టీ షాపులో కూర్చుని వాళ్ళో గొప్ప రేపటి కోసం కలలు కంటున్నారు. నలుగురు ఆడపిల్లలు కోకొసిప్ చేస్తూ రాత్రి స్టార్ టీవీలో చూసిన సాఫ్ట్ ఫోర్నో మూవీ గురించి పెద్దపెద్దగానే మాట్లాడు కుంటున్నారు. అక్కడా ఇక్కడా సిద్ధాంత చర్చే.

మధ్యాహ్నమైంది. అదే ఇరానీ హోటల్. అదే టీ. కొంచెం చిక్కనైంది. టీ షాపులో నేనొక్కణ్ణే. ఒక ఘోస్ట్ ట్రైన్‌లో రెండు నెలల క్రితం ఈ ఊర్లో దిగబడ్డాను. ఇక్కడకు వస్తూనే మా నాన్న తన క్లచస్‌లోకి లాక్కున్నాడు. మురిగిపోయిన డబ్బులు చల్లి, పెంచిన పొలిటికల్ పార్టీ. రాగానే దాని యువనేత పదవి నాకంట గట్టాడు. ఈ పుట్టగొడుగు పార్టీలకు సిద్ధాంతా లుండవు. ప్రభుత్వం కింద పంటిరాయిలా ఉండడమే. వాటం కుదిరితే అధికారం. లేకుంటే ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి పైసలు దండుకోవటం.

రెండేళ్ళ జైలు. దానికి ఎర్రరంగు పులిమి నాకో మార్టియర్ డమ్ క్రియేట్ చేశాడు మా నాన్న. ట్రెచరస్ క్రీచర్! ముతక ఖద్దరు, త్రిబుల్ ఫైవ్ సిగరెట్లు, ఫారిన్ సెంట్ కలగలిపిన సరికొత్త రాజకీయ కంపు మధ్యలో జారుతూ.... జారుతూ.... అట్లా అని దీన్ని నేను హేట్ చెయ్యటం లేదు. పాము కోరలు పీకేసి జేబులో పెట్టుకొని తిరగటంలో మజా లేదూ! అట్లా ఎంజాయ్ చేస్తున్నాను.

ఇప్పుడిక మానిఫెస్టోలు వగైరాల ప్రశ్నలు లేపకు. ఏ సిద్ధాంతాలు లేని వేశ్య ఈ పార్టీ. సమస్య ఉంటే చాలు పొలో మంటూ గుంపును వేసుకొని పరిగెత్తటమే!

పదివేలమంది దాకా అనుచరులు... ఫన్నీ... నేను తుమ్మినా, దగ్గినా జై,జైలు. ఈ మరుగుజ్జుల రాజ్యంలో నేనే అత్యంత పొడగరిని.

చివరిగా ఒకానొక వృద్ధ టామ్‌బాయ్‌కి, మొగుణ్ణి కూడా అయ్యాను. ఆల్ ఇన్ ది ఫాదర్స్ గేమ్!

రేపో, మాపో మీ అందరిముందు అవతార పురుషుడిలా ప్రత్యక్షం అవుతాను. సెలెక్టెడ్ పాసేజస్‌ని బట్టీ పెట్టి మీ ముందు వల్లిస్తాను.

కొత్త శరీరాన్ని తొడుక్కోబోయే ముందు రాస్తున్న చిట్టచివరి ఉత్తరం.

సంధ్యా! నువ్వు నా ఆశ్చర్యం! మనుషుల మీద, భవిష్యత్ మీద అంత గొప్ప నమ్మకం ఎట్లా పెంచుకోగలవు? ఎండి పగుళ్ళు వారిన నేలలో సైతం అట్లా పువ్వులా విరిసి.... లైకే రోజ్... ఐ ఎడ్మైర్!

నీ భర్త కూడా.... నాకంతా తెలుసు. రహస్యాలు చదవగల మాంత్రికుణ్ణి! ఐ ఎడ్మైర్ హిమ్!

రెడీమేడ్ ఉద్యమాన్నొకదాన్ని భుజాన వేసుకొని, మాస్క్ తగిలించుకొని, ఎప్పుడో మీ

ఊరూ వస్తాను. బివేర్ ఆఫ్ మి!

పి.ఎ. శంకరం

"పి.ఎస్ : నీ షిజోఫ్రినిక్ మదర్! ఈజ్ షి స్టిల్ ఎలైవ్?"

*   *   *

ఈ శంకరం ఎప్పుడూ ఇంతే. అర్థం కాని సర్రియలిస్టు పోయమ్. అస్పష్టత, అనార్కిజమ్, అతను కావాలని వేసుకునే ముసుగులు. ఇన్నాళ్ల పరిచయంలో అనాచ్ఛాదితమైన అతని అంతరంగాన్ని ఒకసారైనా తడమగలిగానా, అని సందేహం?

డిగ్రీ ఫైనలియర్, శంకరం పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పరిచయం అయ్యాడు. లిటరేచర్‌లోనూ, ఫిలాసఫీలోనూ ఎమ్మేలు చేశాడు. ఇండియన్ మాసెస్ పైన ఎమ్.ఫిల్ కూడా. ఫ్రాయిడ్ అంటే అతనికి గురి. సీరియస్ థింకింగ్ అతని హాబీ.

ఒక బంద్ రోజు. గేటు దగ్గర పదిమంది కుర్రాళ్ళు. లోపలికి పోకుండా నిరోధిస్తున్నారు. వాళ్ళలో శంకరం కూడా ఉన్నాడు. బెంగాలీ కవుల్లా పొడుగాటి లాల్చీ, చేతిలో శ్రీశ్రీ మార్కు సిగిరెట్, జుట్టు బాగారాలిపోయి నుదురంతా విశాలమైదానంలా ఉండి, దాని కింద మందపాటి కళ్ళద్దాలు. ఆ అద్దాలు లోపలి భావాల్ని వెయ్యింతలుగా మాగ్నిఫై చేసి, గొప్ప నటుడేమో అనే భ్రాంతినిస్తాయి.

పదకొండు గంటలవరకూ గేటు దగ్గరే పచార్లు చేసి, ఇంటి ముఖం పట్టాను. బస్సులు లేవు. నడిచీ, నడిచీ, ముగింపు లేకుండా ఉందా నడక. పైన ఆకలి. రోడ్డు పక్కన బంకు ఒకటి తెరిచి ఉంది. చుట్టూ నాలాంటి ఆకలి ప్రాణులు పదిమంది దాకా మూగి ఉన్నారు. రెండు బన్ రొట్టెలు, ఉగ్గిన్నలాంటి కప్పులో టీ.... ఆత్రంగా తింటూండగా శంకరం కనపడ్డాడు. "ద హంగ్రీ ప్రిన్సెస్ ఆన్ ది రోడ్! ఈ కుళ్ళిపోయి, ఈగలు ముసిరిన బన్ తిని, ఏ డయేరియానో, కలరానో తెచ్చుకుని, హాస్పటల్ పాలయి, బోలెడన్ని సింపతీలు, కావాల్సినంత రెస్ట్.... గొప్ప ప్లాన్ మీద ఉన్నట్టున్నారు...." నోటిదాకా వచ్చిన రొట్టెను లాక్కుని, పక్కనపెట్టి, "రండి... రూమ్‌లో బ్రెడ్, జాము ఆమ్లెట్లు ఉన్నాయి" అంటూ ముందుకు నడిచాడు. తోవ పొడవునా అతనే మాట్లాడుతున్నాడు. మూడవ ప్రపంచదేశాలు అమెరికన్ సామ్రాజ్యవాదం అనే టాపిక్. కొద్దిగానన్నా అర్థం చేసుకుందామని ఆశతో చాలా శ్రద్ధగా ఉన్నాను. స్కూలు పిల్లలు పాఠాన్ని బట్టీ పెట్టి తిరిగి అప్పజెప్పినట్లుగా... అర్థం కాని మోనోలాగ్.

రూమ్ అని చెప్పాడే గానీ అదో పెద్ద పాలెస్‌లా ఉంది. రూమ్ నిండా పుస్తకాలు. ఫిక్షన్, నాన్ ఫిక్షన్. గోడపైన పెయింటింగ్స్. లంపెన్ సొసైటీ గురించి, సోషలిజం గురించీ, థర్డ్ వరల్డ్ పోలిటిక్స్ గురించి మాట్లాడే ఈ మనిషి ఇంతటి అరిస్టోక్రాటా అని విస్తుపోయాను.

"హెల్ప్ యువర్ సెల్ఫ్" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకుతీసుకెళ్ళాడు. ఎదురుగా తినడానికి కావలసినన్ని. అయితే ఆ మనిషి నన్ను సరిగా తిండి కూడా తిననివ్వలేదు. పదో, పదిహేనో పుస్తకాలు మోసుకొచ్చాడు. ఒక్కొక్కటి తెరిచి ఇటు చూడండి ఈ పోయమ్‌లో అందం - ఎజ్రాపౌండ్ రాసింది. ఈ కథ - బోర్జెస్ అని లాటిన్ అమెరికన్ రైటర్, నేను ఎప్పుడూ వినని కొత్త కొత్తపేర్లు. పాట్రిక్ వైట్, గ్రాహంగ్రీన్, సాల్వడార్ డాలీ, చెవి పక్కన ఒకటే రొద. గంట పైనే అయ్యింది. నోట్లోకి రెండు బ్రెడ్ ముక్కలు కూడా వెళ్ళలేదు. విసుగేసి, అతని కళ్ళలోకి తీక్షణంగా

చూస్తూ.... "యూ ఆర్ సో షై.... అట్లా కళ్ళు దించుకొని మాట్లాడ తారేం? నా కళ్ళలోకి చూస్తూ మాట్లాడండి! మీకు కమ్యూనికేషన్ తాలూకు బేసిక్స్ కూడా తెలిసినట్లు లేదే?" అన్నాను. అతను షాక్ తిన్నాడు. ముఖంలో రంగులు మారాయి. నాకు కావలసిందీ అదే. ఆ తరువాత అతను పెద్దగా మాట్లాడలేదు. గంట తరువాత బయల్దేరే ముందు నా చేతిలో రెండు పుస్తకాలు పెట్టి, స్త్రీలందరూ చదవాల్సిన పుస్తకాలివి అన్నాడు. సిమోదిబువా రాసినవి.

బయటకు వస్తుండగా, వరండాలో, ఒక గోడకు మధ్యన ఖాళీ ప్రదేశంలో, వాడని గులాబీదండ వేలాడదీసి వుంది. "ఎంత శూన్యవాది అయితే మాత్రం ఖాళీగోడను పూజిస్తు న్నారా?" నవ్వుతూ అన్నాను. అతనిలో వింత కదలిక. ముఖంలో విషాదం. ఆర్ద్రత, "అమ్మ చనిపోయిన ప్రదేశం అది. చివరిసారిగా ఆ ప్రదేశంలో ప్రాణాలతో మసలింది తను. ఆ ప్రదేశం నా సెంటిమెంట్. ఆ గోడను ముట్టుకుంటే అమ్మను ముట్టుకున్నట్లే ఉంటుంది" అతని కళ్ళలో నీరు చెంపలపైకి పాకి.... "సారీ!" అంటూ బయటికి నడిచాను. అంతవరకూ ఉల్లాసంగా గడిచిన రోజు ఆ క్షణం నుండి మెలాంకోలిక్‌గా మారింది. ఈ మదర్ ఫిక్సేషన్ చాలా సున్నితమైన ఫినామినన్. కవుల్నీ, ఆర్టిస్టుల్నీ మరీ ఎక్కువగా పీడిస్తుంది.

శంకరం పుణ్యమా అని, నాకు కొత్త ప్రపంచపు ద్వారాలు తెరుచుకున్నాయి. అతనిచ్చే పుస్తకాలు నా మన:పరిధిని విశాలం చేస్తున్నట్టుగా అనిపించేవి. శంకరంతో పరిచయం అట్లా నెలలపాటు సాగింది. అతనితో ఎంతసేపు గడిపినా ఎందుచేతనో అతని హృదయాన్ని ముట్టుకోవాలనిపించేది కాదు. అతను కూడా అట్లాంటి స్పందనను లోపలెక్కడో దాచిపెట్టి దానికి తలుపులు, తాళాలు వేసినట్లుగా ఉంటాడు.

అప్పుడప్పుడు శంకరం చాలారోజుల పాటు మాయం అవుతుంటాడు. "యూజీ." లోకి వెళ్ళానంటాడు. సీరియస్‌గా ముఖం పెట్టి. "నీ ముఖంలో విప్లవం పలకదు. అంత పెద్ద పెద్ద విషయాలు నీకెందుకు?" అంటే శంకరం చాలా నొచ్చుకుని, పుస్తకాల అడుగు నుంచి సైక్లోస్టైల్డ్ కాగితాలు బయటకు లాగుతాడు. "ఇవి పార్టీ డాక్యుమెంట్సు. ఇవి పోలీసులకు కనిపిస్తే పదేళ్ళు శిక్ష ఖాయం" అంటాడు ఎవిడెన్స్ ప్రొడ్యూస్ చేస్తున్న ముద్దాయిలా. "నో యూజ్! కుట్ర కేసుల్లో ఎఫ్.ఐ.ఆర్.లో నీ పేరు చూపించినా నిన్ను విప్లవవాదిగా అంగీక రించను. ముందీ అరిస్టోక్రసీని తగలబెట్టు. ఆ పుస్తకాల్ని ఏ చచ్చిపోయిన వాడికో డెత్ బెడ్ ప్రజెంట్‌గా ఇవ్వు. ఆ సోడాబుడ్డి కళ్ళజోడూ, బెంగాలీ బాబు గెటప్ వదిలిపెట్టు. చివరాఖర్న గోడకు తగిలించిన అమ్మనే సెంటుమెంటునీ తీసెయ్యి. అప్పుడే విప్లవం గురించి ఆలోచించ డానికి అర్హత వస్తుంది'
'. నా మాటలకు ఖంగు తినేవాడు. ముఖ్యంగా చివర్న అన్న 'అమ్మ సెంటిమెంటు' అనే మాటకు.

శంకరం కనపడకుండా అదృశ్యమయిన రోజుల్లో ఒకసారి అతన్తో చెడ్డ అవసరం వచ్చింది. అతన్తో అంటే అతని డబ్బుతో. వెయ్యి రూపాయలు కావాల్సి వచ్చింది.

ఒకానొక పాటలు పాడే కుర్రవాడితో పరిచయమయి, స్నేహమయి, ప్రేమయి ఒక ఏకాంతపు సాయంకాలం పూట, అతని గదిలో అతని పాటకు మనసే కాక శరీరం కూడా పరవశించి పాటలోంచి నిశ్శబ్ద లైంగిక గీతంలోకి ప్రయాణించి అవసరమైన జాగ్రత్తలు తీసు కోలేని ఉద్వేగపు క్షణాలవి. ఆ మరుసటి నెల పిరియడ్స్ రాలేదు. అతను పాటలు మాత్రమే

పాడగలడు. పెళ్ళి చేసుకోలేడు. అతని పాటలు జనానికి, అతని జీవితం జనానికి. సంధ్యతో, సంధ్యలో పెరిగే ఫీటస్‌తో అతన్ని కట్టి వేయడం, గొప్ప అపచారం 'అబార్షన్ చేయించుకో! తబలా, హార్మోనియం అమ్ముదాం" అన్నాడు."అబార్షన్ నా సమస్య. నువ్వా విషయం మర్చిపో....." అంటూ అతన్ని వారించానే గానీ నాకో వెయ్యి రూపాయలు కావాల్సి ఉంది, అబార్షన్‌కి, ఏడీ శంకరం?

శంకరం కోసం వెతికే ప్రాసెస్‌లో పదిహేను రోజులు గడిచిపోయాయి. లోపల ఫీటస్ బాగా పెరిగి "నేను పుట్టాలో లేదో త్వరగా తేల్చుకో..." అని అల్టిమేటమ్ ఇస్తున్నట్లుగా ఉంది. ఇంటి దగ్గర షిజోఫ్రీనియాతో బాధపడే అమ్మ. "దు:ఖాన్ని మర్చిపోవాలి గదా!" అంటూ ఎప్పుడూ నిషాలో ఉండే నాన్న! శంకరం ఒక్కడే రక్షకుడు!

చివరకు ఒకరోజు శంకరం దొరికాడు. పెరిగిన గడ్డం, మాసిన బట్టలు. నన్ను చూడగానే ముఖం వెలిగింది. "సమయానికి కనిపించావు. ఒకచోటకు వెళ్దాం రా!" అంటూ లాక్కువెళ్ళాడు. "నువ్వు చెప్పినట్లే చేస్తున్నాను. ఇంటినీ, ఆస్తినీ, పెటీ బూర్జువా మా నాన్నను వదిలేసి వెళు తున్నాను. ఒక్క వెయ్యి రూపాయలు మాత్రం జేబులో వేసుకొని బయటకు వచ్చాను. ఆ మనిషి నన్ను బాగా విసిగించాడు. గతంలో అమ్మను కూడా అట్లాగే విసిగించేవాడు. సినిమా ప్రొడ్యూసర్ కూతుర్ని ఒకదాన్ని తెచ్చి నన్ను పెళ్ళాడమంటాడు. ఇన్ని పుస్తకాలు చదివి, ఇంత చైతన్యం కలిగి ఎట్లా అరేంజ్‌డ్ మారేజ్ చేసుకోను? గుడ్ బై ఓల్డ్‌మాన్ అంటూ బయటకు వచ్చాను"

నా గుండెల్లో రాయి పడింది. ఈ మనిషినిప్పుడు డబ్బులెట్లా అడగను.

ఆటో మాట్లాడి ఎక్కమన్నాడు. దోవలో పూలు కొన్నాడు. సిమెట్రీ దగ్గరకు చేరాము. వందలాది సమాధులు. భయం వేసింది. ప్రపంచమంటే మరణమేనేమో అనిపించే భయం. అతను సమాధుల మధ్య అటూ ఇటూ తిరుగుతున్నాడు. 'కమల 1932-1970' అనే సమాధి కోసం. అప్పటికే సాయంకాలం అయ్యింది. కప్పెర కప్పెరగా చీకట్లు. మసక చీకటిలో అతనట్లా ఒక సమాధి కోసం వెతకటం మనసు ఫిలసాఫికల్‌గా అయ్యింది. అతను సమాధికోసం కాక, పోగొట్టుకొన్న దేనికోసమో వెతుకుతున్నట్టుగా ఉంది. ఒక్కొక్క సమాధిపైన మట్టిని తుడుస్తూ - అట్లా రాత్రి ఎనిమిదికి వాళ్ళ అమ్మ సమాధిని గుర్తుపట్టాడు. "పదేళ్ళు దాటింది. ఇక్కడకు రావాలంటే ఇష్టం ఉండదు. ఆవిడ పోయినప్పుడు వచ్చాను. మళ్ళీ ఇప్పుడు" సంజాయిషీగా చెప్పాడు.

సమాధిని శుభ్రం చేసి, దానిపై పూలు జల్లి.... కళ్ళు మూసుకొని ధ్యానిస్తున్నట్లుగా, వింతగా ఉంది శంకరంప్రవర్తన. ధ్యానం లోంచే ఏదో గొణుక్కుంటున్నట్లుగా.... "యూనో.... అమ్మకు, నాకూ దగ్గరి అనుబంధం లేదు. షి వజ్ సో లోన్లీ! కన్నవాళ్ళను, ఊరిని వదిలి వేల మైళ్ల దూరం ఇటు ప్రయాణించి ఇక్కడ నాన్నను పెళ్ళి చేసుకుంది!"

"యూనో.... షి మారీడ్ హర్ బ్రదర్!" బాంబు పడ్డట్టుగా ఉలిక్కిపడ్డాను. శంకరం అట్లాగే కళ్ళు మూసుకొని ధ్యానంలో ఉన్నవాడిలా చెప్పుకుపోతున్నాడు. "వాళ్ళ పెద్దనాన్న కొడుకుని పెళ్ళి చేసుకుంది. తాతయ్య ఇద్దర్నీ పిలిచి "ఎక్కడకైనా దూరంగా పారిపోండి! మీరు చచ్చిపోయారని అందరికీ చెబుతాను. చచ్చిపోయినట్లే శ్రాద్ధకర్మం చేస్తాను. గెట్‌లాస్ట్! మళ్ళా

కనపడవద్దు'' అంటూ లక్షరూపాయల చెక్కు ఇచ్చి పంపించాడు. సాహసమైతే చేసింది కానీ, ఒక గిల్ట్ ఫీలింగ్‌తో తనను తాను చంపుకొంది అమ్మ. స్లో పాయిజన్ తీసుకున్న మనిషిలా క్రమక్రమంగా క్షీణించింది. నాన్న కసి పట్టిన వాడిలా లక్షలు సంపాదించాడు. పొగాకు వ్యాపారం, స్థలాల వ్యాపారం, ఆఖరకు సినిమా వ్యాపారం. ఎక్కడ డబ్బు పెడితే మల్టిపై అవుతుందో ఆయనకుతెలుసు. ఆయనట్లా డబ్బు చేసిన మనిషిలా ఊరిపోతూనే ఉన్నాడు. నేనా యింట్లో వద్దనుకున్న భ్రూణంలా.... మనిషంత ఎత్తు పాపంలా పెరిగాను. "శంకరం ఏడుస్తున్నాడా?" ఊహులేదు. కానీ బలమైన రోదనలన్నీ నిశ్శబ్దంగానే ఉంటాయి. సిమెట్రీలోంచి బయటకు వచ్చేసరికి రాత్రి చాలా పొద్దుపోయింది. వెనక్కు నడుచుకుంటూ రైల్వేస్టేషన్ వైపు వచ్చాము. "ముందు ఏ ట్రైన్ వస్తుందో ఆ ట్రైన్‌లో ఎక్కి ఆ ట్రైన్ వెళ్ళే చివరి స్టేషన్ వరకూ వెళ్తాను". చిన్నపిల్లాడిలా మాట్లాడుతున్నాడు శంకరం. ఎందుకో అతన్ని చూస్తే దిగులు వేసింది. రద్దీలో తప్పిపోయిన పిల్లవాడిలా ఉన్నాడు. అతని చేతుల్ని నా చేతుల్లోకి తీసుకొని మృదువుగా వత్తి, అతని తలను ముందుకు లాక్కుని ప్రేమగా ముద్దుపెట్టి "వెళ్ళిరా శంకరం!" అంటూ గుడ్‌బై చెప్పాను. ఈ హడావుడిలో నా వెయ్యి రూపాయల మాటే మర్చిపోయాను.

ఆ మరుసటిరోజు నా పుస్తకాల్లో ఖరీదైనవి ఒక సంచిలో వేసుకొని సెకండ్‌హాండ్ బుక్‌స్టాల్‌కి వెళ్ళాను. పుస్తకాల్ని అమ్ముతుండగా క్లాస్‌మేటూ, మరో స్నేహితుడు మాధవ్‌కి దొరికిపోయ్యాను.

మాధవ్ నా క్లాస్‌మేట్. స్టూడెంట్స్ అసోసియేషన్‌కి సెక్రటరీ. సిద్ధాంతాల గంద్రగోళం లేని ధోరణి. మనం చేసే పని నలుగురికి ఉపయోగపడితే చాలంటాడు. అతని ప్రోత్సాహంతోటే కాలేజీ ఎలక్షన్లలో లేడీ రిప్రజెంటేటివ్‌గా ఎన్నికయ్యాను. ఎంచేతో మాధవంటే శంకరానికి పడేది కాదు. "ఈ మాధవ్‌ది చిన్నబుర్ర. అందులో సిద్ధాంతాలు, వైరుధ్యాలు లాంటి పెద్ద విషయాలు పట్టవు!" అని ఈసడించేవాడు. అయినా మాధవ్‌లోని నిజాయితీ అంటే నాకిష్టం.

పుస్తకాలు అమ్మనీయకుండా షాపులోంచి బయటకు లాక్కొచ్చాడు మాధవ్.

"ఎందుకమ్ముతున్నావు"

"డబ్బు కావాల్సి వచ్చింది"

"అంత అర్జంట్ ఖర్చులేంటి?"

"అబార్షన్ చేయించుకోవాలి" మాధవ్ దిమ్మెరపొయ్యాడు. మాధవ్‌కి విషయం చెప్పాను.

"లేటరల్ థింకింగ్ గురించి విన్నావా? సమస్యను ముక్కు సూటిగా మాత్రమే కాకుండా, మరోవైపు నుండి కూడా సాల్వ్ చెయ్యొచ్చు. ప్రయత్నించకూడదూ!"

"నాకు తెలిసిన సొల్యూషన్ ఇదొక్కటే"

"నాకు ఇంకో సొల్యూషన్ కూడా తెలుసు!" అంటూ మాధవ్ నన్ను వెంట తీసుకెళ్ళాడు. వారం తరువాత మాధవ్, నేనూ రిజిష్టర్ ఆఫీసులో పెళ్ళి చేసుకున్నాము.

ఆ తరువాత రెండు నెలల్లో శంకరం అరెస్టు అయినట్లు వార్త వచ్చింది. ఎమర్జెన్సీ రోజులవి. ఈయనో రహస్య పత్రిక పెట్టాడు. 'చండమారుతం' దాని పేరు. ప్రింటింగ్, ఎడిటోరియల్ అన్నీ ఆయనే. ఒక అర్ధరాత్రిపూట వచ్చి పత్రికను నాకిచ్చి, చదివి రహస్యంగా స్నేహితులమధ్య సర్క్యులేట్ చెయ్యమని చెప్పి వెళ్ళాడు. తీవ్రవాద సంస్థల మద్దతు ఆ పత్రికకు

ఉందని చెప్పాడు. పది సంచికల దాకా వచ్చిందా పత్రిక. బెంగుళూరులో అరెస్టు అయిన ఒక సోషలిస్టు నాయకురాలిని జైల్లో చిత్రహింసలు పెట్టడం గురించిన వ్యాసం పెద్ద సంచలనాన్ని సృష్టించింది. ఆ తరువాత వారంరోజులకే శంకరం అరెస్టు అయ్యాడు. ఐదారు కేసులు బనాయించారు. ఎమర్జెన్సీ ఎత్తివేసి, మళ్ళీ ఎలక్షన్లు జరిగి, ప్రభుత్వం మారిన తరువాత చాలామంది విడుదలయ్యారు కానీ, ఎందుకో శంకరం మాత్రం విడుదల కాలేదు.

ఎనభై మూడులో కాబోలు శంకరం జైలు నుండి విడుదలయ్యాడు. అన్నాళ్ళూ జైల్లో రాజకీయ ఖైదీలాగానే గడిపాడు. శంకరానికో పొలిటికల్ ఇమేజి వచ్చింది. శంకరం దృష్టి పర్యావరణం మీద పడింది. బహుగుణ 'చిప్కో' ఉద్యమం, నర్మదా బచావ్ ఉద్యమం మొదలువుతున్న రోజులవి.

"ఇన్నాళ్ళ జైలు జీవితంలో మనసు మొద్దుబారిపోయింది. హఠాత్తుగా రెక్కలు విరిచేసిన పక్షినయినాను. నా శరీరమే నాకో పంజరం అయిపోయింది. ఒక గొప్ప 'కాజ్' కోసం జైలుకెళ్ళాను. ఒక్కడూ గుర్తించి చావడే! ఏమి దేశం! ఏమి మనుషులు! ఏవి తల్లీ! నిరుడు నా చుట్టూ ముసిరిన స్నేహగీతాలు!' అని గొల్లుమనాలనిపిస్తుంది. నువ్వన్నా పలక రిస్తావా?" అంటూ పెద్ద దిగులు ఉత్తరం రాశాడు. ఉత్తరం అందిన వారానికి మనిషే దిగబడ్డాడు.

వందమందితో ఊరేగింపు ఒకటి ఇంటి ముందు ఆగింది. పెయింటర్‌లు, ఇంటిపని చేసే వర్కర్ల సంఘం కాబోలు అనుకున్నాను. తీరా బయటకు వచ్చి చూస్తే నాజూకుగా, స్టైల్‌గా ఉన్న యువతీ యువకులు "క్లీన్ యువర్ సిటీ" అనే పర్యావరణ ఉద్యమమట. గోడలపై ఉన్న నినాదాల్ని చెరిపివేయటం, రోడ్డుపైనున్న మురికిని తొలగించటం, స్లమ్స్‌ని బాగు చెయ్యటం, ఎక్కడో ఫ్రాన్స్‌లో ఉందట. దాని నకలు ఇదట. చూస్తుండగానే ఆ గుంపు లోంచి శంకరం బయటకు వచ్చాడు. పొడవాటి "ఏప్రాన్" తొడుక్కుని, నెత్తిపై "యువర్ సిటీ ఈజ్ యువర్ టెంపుల్" అనే కాప్షన్ ఉన్న టోపీతో, వింతగా ఉన్నాడు శంకరం.

గుంపుకు సలహాలు, సూచనలు ఇచ్చి ముందుకు పంపి, ఒక అమ్మాయిని వెంట తీసుకుని లోపలికి వచ్చాడు శంకరం. 'మై స్పిరిట్యుయల్ గురు' అంటూ ఆ అమ్మాయిని నాకు పరిచయం చేశాడు.

శంకరం ధోరణి మారలేదు. ఎదుటి వాళ్ళకు అవకాశం ఇవ్వకుండా తానొక్కడే మోనోలాగ్‌లాగా మాట్లాడటం, ఒక టాపిక్‌లోంచి ఇంకో టాపిక్‌లోకి ప్రవహించటం, తన మాగ్జైన్ గురించి, జైలు జీవితం గురించి చెప్పాడు. తన సాహసం గురించి ఏదో పత్రికలో రాసిన సంపాదకీయం చూపించాడు. కొన్ని క్షణాలు ఆగి సోవియట్ పరిణామాల గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. ప్రపంచ వ్యాప్తంగా ఆలోచన చచ్చిపోయిందంటూ దు:ఖించాడు.

హఠాత్తుగా "ఆ కుర్రాడి పేరేమిటి?" అన్నాడు. ఆశ్చర్యంగా చూశాను. "పాటలు పాడే కుర్రాడు" రహస్యాన్ని కెలుకుతున్నట్లుగా అడిగాడు. "నాకూ ఒక ఎఫైర్ ఉంది!" మిస్చీవస్‌గా నవ్వాడు. "ఆ అమ్మాయే, కొంచెం డ్రైగా జీవం లేనట్లుగా ఉంది కదూ!" తను చెప్పిన పోలికను ఎంజాయ్ చేస్తున్నట్లుగా చాలాసేపు నవ్వుకున్నాడు.

"షియీజ్ ఏన్ ఎన్విరాన్‌మెంటలిస్టు!" జైలు నుండి వస్తుండగా ట్రైన్‌లో పరిచయ మైంది. గొప్ప ఆలోచనలున్నాయి ఆమెకు. నూరుశాతం ఆధునిక యువతి పర్స్‌లో కాంట్రాసెప్టివ్

పిల్స్. బటన్ నైఫూ.... నన్నే పొడవాలని చూసింది ఫన్నీలేడీ! బొంబాయిలో చాన్నాళ్ళపాటు స్ట్రీట్ చిల్డ్రన్స్ హోమ్ నడిపింది. నాకు పరిచయం కాకముందు ఒక అడ్వొకేటును పెళ్ళి చేసుకుంది. అతన్ని లీగల్‌గా వదిలేసి ఇట్లా దేశంపై పడింది. మా ఇద్దరి భావాలు గొప్పగా కలిశాయి. కలిసి జీవిద్దాం అనుకున్నాం. ఈ క్లీన్ సిటీ ఉద్యమం ఆవిడ ఆలోచనే"

"ఆవిడ గురించిన ఒక రహస్యం కూడా చెప్పాలి! షి యీజ్ ఏ లేడీ విత్‌అవుట్ యుటెరస్.... ఫన్నీ..." శంకరం అట్లా పొంతనలేని మాటలు మాట్లాడుతూనే ఉన్నాడు. పక్కన కూర్చున్న అమ్మాయి అతని మాటల్ని ఆరాధనతో వింటోంది. రాబోయే ఐదారేళ్ళకు సరిపడా ఉద్యమాలు గురించిన వివరాలు చాలాసేపు చెప్పేడు శంకరం. వాళ్ళ నాన్న గురించి చెబుతూ "జైలునుండి వచ్చినాక ఆయన్ను కలవలేదు. పెద్ద సినిమా ప్రొడ్యూసరైనాడు. మురికి నిర్మూలన కార్యక్రమంలో అతని సినిమాల్ని కూడా బహిష్కరించాలనే ఆలోచన ఉంది నాకు!" అంటూ నవ్వుతూ చెప్పేడు.

శంకరం బయలుదేరుతూ, ఏదో గుర్తుకొచ్చిన వాడిలా నన్ను పక్కకు పిలిచి "ఈ ఉద్యమం, హడావుడి సంగతి మర్చిపో! ఇదో కాలక్షేపం నాకు! ఆత్మకు ఇదో అవసరమైన ఎక్సర్‌సైజు! ఈపాటి కాలక్షేపం కూడా లేకపోతేనా చచ్చిపోయి ఉందును. అయితే నిన్ను కలవటం మాత్రం కాలక్షేపం కాదు. మనసుకు అవసరమైన ఆహారం!" అంటూ సీరియస్ ముఖంతో వెళ్ళిపోయాడు.

ఆ తరువాత చాలాయేళ్ళపాటు శంకరం గురించిన కబురు లేదు. కలకత్తాలో మదర్ థెరిస్సా మిషన్‌లో పని చేస్తున్నాడని, పురూలియా ప్రాంతంలో గిరిజనుల కోసం ఒక ఆర్గనైజేషన్ నడుపుతున్నాడని ఫ్రెండ్స్ చెప్పేవాళ్ళు. ఫ్రెంచి డాన్సర్‌తో సన్నిహితంగా గడిపేవాడని, ఆ అమ్మాయి రహస్య మరణంపై దర్యాప్తు జరిగి శంకరం చానాళ్ళు రిమాండ్‌లో ఉన్నాడని కూడా అనేవాళ్ళు.

ఇన్నాళ్ళకు ఇప్పుడీ ఉత్తరం.

* * *

కొత్త ఆర్థిక వ్యవస్థకు పూజలు చేస్తున్న రోజులు. మల్టీ నేషనల్స్‌కు అందమైన ఎరీనా ఈ దేశం. 'కెంటకీ చికెన్ ఫుడ్స్' అనేవి ప్రపంచంలో పేరుమోసిన రెస్టారెంట్లు. దాని బ్రాంచి విజయవాడలో పెట్టాలనే ప్రయత్నంపై శంకరం పోరాటం. కెంటకీ చికెన్‌లో కాన్సరు తెచ్చే పదార్థాలు ఉన్నాయని పరిశోధనలో తేలిందని, అందుచేత ఈ కెసిఎఫ్ బ్రాంచీలు దేశంలో ఎక్కడా పెట్టకూడదని శంకరం ఉద్యమం.

శంకరం తన పార్టీ సహచరులతో వారం రోజులపాటు ఊళ్ళో కేంప్‌కు వచ్చాడు. శంకరంలో బాగా మార్పు వచ్చింది. వయస్సో, మరే అర్థం కాని విషాదమో అతనిలోని వెలుగును ఆర్పివేసినట్లుగా అనిపిస్తుంది. నా భ్రమేమో! బోలెడంత ఫాలోయింగు. ఏకాంతంగా కూర్చుని మాట్లాడే అవకాశమే రాలేదు. వారం పొడవునా ఏవేవో మీటింగులు. చిన్న చిన్న పట్టణాల్లో బహిరంగసభలు. లాయర్లతో, యూనివర్సిటీ స్టూడెంట్లతో మేధావులతో చర్చావేదికలు. "ఆరోగ్య కరమైన జీవితం ఇక్కడో కల మాత్రమే! ముందు తరాలకు ఈ కల కూడా మిగలదేమో!" అనేది అతని నినాదం. కెసిఎఫ్ ప్రారంభోత్సవం రోజు అన్ని ఊళ్ళ నుండి సమీకరించిన జనంతో బ్రహ్మాండమైన ప్రదర్శన ఇవ్వాలని అతని ఆలోచన. "ప్రాణాలైనా అర్పిద్దాం! ఈ కాన్సర్ తెచ్చే

చికెన్‌ను మనకు అమ్మకుండా ఆపుదాం!" అనేది అతని మరో నినాదం.

కెసిఎఫ్ ప్రారంభోత్సవం రోజు, మాధవ్, నేనూ కూడా ఒక ఊరేగింపు వెంట నడిచి కెసిఎఫ్ రెస్టారెంటు దగ్గరకు చేరాము. నిషేధాజ్ఞల్ని కాదని వేలాదిమంది జనం మూగారక్కడ.

"సరికొత్త వయొలెన్స్ మన మధ్యకు వస్తుంది. ఇక మనకు ప్రతిరోజూ భోపాల్ దుర్ఘటనలు, బలియాపాల్ విషాదాలు, నర్మదా ఉదంతాలే మిగులుతాయి. గాలీ నీరూ కలుషితం అయ్యాయి. పచ్చదనం మన మధ్య నుంచి అదృశ్యమైంది. ఇప్పుడు మనం తినే తిండి కూడా విషమయం అయ్యింది. ఇది రుచికరమైన చికెన్ కాదు. క్యాన్సర్ తెచ్చే చికెన్ అని సైంటిస్టులు మొత్తుకుంటున్నా ప్రభుత్వం వినడం లేదు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం గురించి ఈ ప్రభుత్వానికి చింతలేదు. డాలర్లు కురిస్తే చాలు! హిట్లరు, స్టాలిన్‌ల గురించి వినే ఉంటారు! వాళ్ళ ఆత్మలన్నీ మల్టీనేషనల్స్ రూపంలో మన మధ్య తిరుగుతూ, జాతుల్ని, దేశాల్ని సమూలంగా నాశనం చెయ్యాలని చూస్తున్నాయి. అయితే ఈ కుట్రను సాగనిస్తామా? ప్రాణాల్ని ఒడ్డి అయినాసరే ఈ మల్టీనేషనల్స్ దాడిని అడ్డుకుంటాము!"

శంకరం ఉపన్యాసానికి గొప్ప రెస్పాన్స్ వచ్చింది. నినాదాలు ఆకాశాన్ని చుట్టుముట్టాయి. నినాదాల హడావుడి మధ్య మంత్రిగారి కారు, ఆయన్ను అనుసరిస్తూ మరో పది ఫారిన్ కార్లూ ఆ ప్రదేశంలోకి వచ్చాయి. మళ్ళా నినాదాలు లేచాయి. "అంకుల్ శామ్ గో బ్యాక్!" "క్లోజ్ కెసిఎఫ్" "మినిస్టర్ గో బ్యాక్" అంటూ మంత్రి కారుపై రాళ్ళు విసిరారు. కారు అద్దాలు పగిలి పోలీసులు, సెక్యూరిటీ కమెండోలు జనం పై విరుచుకుపడ్డారు. విరుగుతున్న లాఠీల చప్పుళ్ళు, వీధిలో అటూ ఇటూ పరిగెడుతున్న జనం. శరీరాలు చిట్లి, రక్తం చిమ్మి, వీధి పొడవునా మూలు గులు, అరుపులు, బీభత్సంగా ఉందా దృశ్యం.

ఇంతటి బీభత్సంలో, హింసలో ఊహించని ఒక సంఘటన. శంకరం హఠాత్తుగా జనం మధ్యకు వచ్చి, పెట్రోలు డబ్బా కాబోలు పైకి ఎత్తుకుని, శరీరం నిండా ఒలకబోసుకొని, క్షణాలవ్యవధిలో, జనం వారించే లోపలే, అగ్గిపుల్ల గీసి, తనపైకి విసురుకొని- దేవుడా! భీకరంగా జ్వాలలు పైకి లేచాయి.

*　　*　　*

శంకరం పరిస్థితి క్రిటికల్‌గా ఉంది. 80 శాతం బర్న్స్. స్పృహ వచ్చీ, పోతూ. హాస్పిటల్‌లో శంకరాన్ని చూడాలనే నా ప్రయత్నం నెరవేరలేదు. ఐసియులో ఉంచారు. ముఖ్యమైన ఆప్తుల్ని మినహా ఎవర్నీ లోపలికి అనుమతించటంలేదు.

ఆ సాయంకాలం ఇంటిదగ్గర శంకరం ఇమ్మన్నాడంటూ ఒక ఉత్తరాన్ని తెచ్చి ఇచ్చాడో వృద్ధుడు. స్పృహ వచ్చిన సమయంలో ఉత్తరాన్ని డిక్టేట్ చేశాడట! ఆ వచ్చిన వ్యక్తి శంకరం తండ్రా? ఏమో?

"ఎవ్వరూ ప్రవేశించని నిర్జీవ ప్రదేశంలో ప్రయాణిస్తున్నట్లుగా ఉంది. ఒంటరిగా, వెనక్కు చూస్తే భయం గొలిపే లోయలాంటి ప్రదేశంలో ప్రయాణిస్తున్నాను. ఈ ప్రయాణం ఇప్పటిది కాదు. పురాతనమైంది. నా బాల్యమంత. నా తొలి ఊపిరంత. ఇన్నాళ్ళుగా ప్రయాణిస్తున్నా శైశవం వెళ్ళిపోలేదు. అమ్మ అనే వాంఛలోంచి బయటపడలేదు. ఫ్రాయిడ్, మార్క్స్, గోర్బచేవ్, మదర్ థెరిస్సా, బాబా ఆమ్టే ముగిసిపోని బాల్యం చుట్టూ విసిరేసిన ఆట వస్తువులు. ఆటల్లో

థ్రిల్‌కోసం కొత్త కొత్త కాన్సెప్ట్స్, కొత్త కొత్త ఉద్యమాలు.

"నేనో ఒంటరి వేటగాణ్ణి! ఆయుధాలన్నీ కనపడకుండా దాచివేసి నాగరికుడిలా ఆధునికుడిగా మీ మధ్య తిరుగుతూ మిమ్మల్ని వేటాడాలని చూసేవాణ్ని! బివేర్ ఆఫ్ మి!

"సంధ్యా! నేనంటే మీకింకా తెలియదు. మీ మధ్యలో సరస్సులా వ్యాపిస్తాను. వాలిన హంసలన్నీ నాలోపలికి లాక్కొని, మంచుగడ్డలాంటి నన్ను తవ్వితే ఎన్నెన్ని మృతజీవాలు! పారిపోండి నా నుంచి! బచ్‌కే రెహనా"

"నన్ను స్పృశించవద్దు! నేను అమ్మను చంపిన వాణ్ణి! నిన్నూ.... నిన్నూ... మీ అందరిని హత్య చేసినవాణ్ణి! కొత్త ఆలోచననూ, కొత్త గాలినీ, సంప్రదాయాన్ని తిరస్కరించే ప్రతి ఆలోచననూ హత్య చెయ్యగలవాణ్ని! వాంఛకు ప్రేమని పేరుపెట్టి ఆవిడో ఇన్‌సెస్ట్ మారేజి చేసుకుంది. నిప్పుల గుండంలో నడిచింది. నలభై యేళ్ళుగా ఆ నిప్పుల గుండంలోనే నేనూ తగలబడుతున్నాను. ఐ హేట్ హర్! ఆవిడే కాదు, కొత్త చూపు ధరించిన మీ అందరినీ ద్వేషిస్తాను! అందుకే స్త్రీల విశృంఖలతను ఎక్స్‌పోజ్ చెయ్యడానికి చాలామంది ఆడవాళ్ళతో తిరిగాను. ఉద్యమాలను అపహాస్యం చెయ్యడానికి వాటిని భుజాన వేసుకొని తిరిగాను"

"నాకో శుద్ధమైన, సాంప్రదాయబద్ధమైన, ఆరోగ్యకరమైన ప్రపంచం కావాలి! నాకో అమ్మ కావాలి! ఒక గృహం కావాలి! ఒకరికొకరు బందీలై ఉండే పురాతన సమాజం కావాలి"

"ఆశ్చర్యంగా ఉందికదూ! నాకూ ఆశ్చర్యమే! ఇంత సుదీర్ఘకాలం నటనా జీవితాన్ని గడపటం! విసుగెత్తి, అర్జంటుగా ఈ ప్రయాణం ముగించాలనిపించింది. ఈ చచ్చిపోవటంలోనన్నా సుఖముందా? ఏమో? కానీ చాలా తమాషా ఉంది! ఈ ఏడుపులు, దు:ఖపడటాలు అంతా ఫన్నీ!"

"కానీ సంధ్యా! ఆవేళ, నువ్వు అట్లా ఒడిలోకి తీసుకొని, మృదువుగా నిమిరి, నన్ను హత్తుకోవటం మాత్రం వింతగా ఉంది. హాయిగా ఉంది. అర్థం కానట్లుగా ఉంది".

- శంకరం

*సుప్రభాతం 20 ఆగస్టు, 1997*